31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
శుక్రవారం, నవంబర్ 20 , 2026
పేజీలు : 8

మంచినీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా
ముందస్తు చర్యలు తీసుకోవాలి
-ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 19: జగిత్యాల నియోజకవర్గ పరిధిలో ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ప్రజలకు నిరంతరాయంగా, మెరుగైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. నీటి సరఫరా సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈలు చందన్, కృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇందిరమ్మ బీమా భరోసా

- గ్రామ గ్రామాన ఇంటింటి సర్వే
- యజమాని, నామినీ, కుటుంబ సభ్యుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ చిత్రా మిశ్రా



చురకలు ప్రతినిధి కరీంనగర్: పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వివరాల సేకరణకు జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సర్వేలో ఏ ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకూడదని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పథకం అమలుకు చేపట్టాల్సిన చర్యలు, కుటుంబాల వివరాల సేకరణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ప్రతి గ్రామంలో ప్రత్యేక బృందాలు శుక్రవారం నుంచే జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్కో గ్రామంలో ముగ్గురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, జీపీ ఓ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సభ్యులుగా ఉండే ఈ బృందాలు కుటుంబ యజమాని, నామినీ, కుటుంబ సభ్యుల పూర్తి సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు.
ఎవరు మిస్ కావద్దు..
పథకం అమలులో వివరాల సేకరణ అత్యంత కీలకమని, ఈ ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, ఎవరి సమాచారం కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది బాధ్యతగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.
రోజువారీ పర్యవేక్షణ తప్పనిసరి
మండల స్థాయిలో ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు, ఎంపీవోలు గ్రామాల వారీగా వివరాల నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్ణీత సమయంలో వివరాల సేకరణ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఇసుక, గ్రావెల్ బ్లాకుల ఈ-వేలం నిర్వహణకు చర్యలు చేపట్టాలి

జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 19: ఇసుక, గ్రావెల్ బ్లాకుల ఈ-వేలం నిర్వహణకు చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లాలో ఇసుక, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని ఖనిజ వనరుల గుర్తింపు, ఈ-వేలం నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో.ఆర్టీ. నం.72, తేదీ: 18.04.2026 ప్రకారం జిల్లాలో ఖనిజాల వేలం ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. ఎండపల్లి మండలం సూరారం, గోదావరిపేట గ్రామాల శివారులోని సర్వే నంబర్లు 41, 290, 296లలో ఒక్కొక్కటి 2.00 హెక్టార్ల చొప్పున మొత్తం ఆరు గ్రావెల్ (మొరం) బ్లాకులను గుర్తించినట్లు తెలిపారు. ఈ బ్లాకులకు ఈ-వేలం నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గుర్తించిన బ్లాకులకు నిర్బంధ రహిత పట్టా జారీకి కమిటీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో -మిగతా 2లో

కొండగట్టు చందనోత్సవాలకు
పటిష్ట బందోబస్తు

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 19: కొండగట్టు శ్రీ అంజనేయస్వామి చందనోత్సవాలకు వచ్చే భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని సురక్షితంగా తిరిగి వెళ్లేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. చందనోత్సవాల సందర్భంగా ఈ నెల 20వ తేదీ నుంచి డిసెంబర్ 29వ తేదీ వరకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం సంబంధిత పోలీస్, ఇతర శాఖల అధికారులతో కలిసి కొండగట్టు ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ చందనోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు -మిగతా 2లో

రేవంత్ రెడ్డి తెచ్చిన కరువుతోనే
రాష్ట్రంలో తాగునీటి కష్టాలు

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 19: రాష్ట్రంలో ఇప్పుడు కాలం తెచ్చిన కరువు కాదు, రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు అని, త్రాగునీటి కరువుతో విద్యాలయాలు బంద్ చేయడం ఆయన నిర్లక్ష్య పాలనకు అద్దం పడుతోందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి విమర్శించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో జగిత్యాల నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నవంబర్ 29 దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, శాసనమండలి ఉప నాయకుడు ఎల్. రమణ, జిల్లా ప్రజా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అలుగునూరులో నవంబర్ 29న జరిగే దీక్షా దివస్ కు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా కేసీఆర్ శాసనసభ పదవికి, ఉప సభాపతి పదవికి రాజీనామా చేసి ఉద్యమించారన్నారు. హైదరాబాద్ ఫ్రీ జోన్ తీర్పుపై -మిగతా 2లో

క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

-జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



చురకలు ప్రతినిధి, జగిత్యాల,నవంబర్ 19 : యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026 క్రీడా పోటీలకు సంబంధించి నీలమణి లోగోను గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు వివిధ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని ప్రోత్సహించడం, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకునేందుకు యువ క్రీడాకారులకు ఈ క్రీడలు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిజన్ అధికారి మధుసూదన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో

ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

-రూ. 3 వేల చొప్పున జరిమానా

చురకలు విలేఖరి,తిమ్మాపూర్ నవంబర్ 19 : తాను కట్టించిన హనుమాన్ ఆలయంలో పూజారిగా ఉంటూ వచ్చిపోయే భక్తులకు ఆశ్రయం కల్పిస్తున్న వ్యక్తిని భక్తులుగా నమ్మించి ఆశ్రయం పొంది రాత్రి అతన్ని గొంతు నిలిమి హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ రెండవ అదనపు జిల్లా జడ్జి పావని గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తిమ్మాపూర్ మండలం జోగయ్య పల్లి గ్రామానికి చెందిన చెలుపూరు పెద్దన్న స్వామి (60) అదే గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మించి అందులో తానే పూజారిగా ఉండేవారు. వివిధ ప్రాంతానుండి అతని వద్దకు సమస్యలతో వచ్చే వారికి ఆశ్రయం కల్పిస్తూ భోజన వసతి ఏర్పాటు చేసేవాడు. దీనిని గమనించిన వరంగల్ శివనగర్ కు చెందిన నీలం శ్రీనివాస్ (32)అతని డ్రైవర్ కోనేటి జ్ఞానేశ్వర్లు (26) ఆలయానికి వచ్చి సమస్యలు చెప్పుకొని ఆశ్రయం పొందారు. రెండు రోజులు అక్కడే ఉండి 2022 జూలై 4న ఉదయం 3 గంటల ప్రాంతంలో తన గదిలో పడుకొని ఉన్న పెద్దన్న స్వామిని గొంతునిలిమి హత్య చేసి నగదు ఇతర ఆభరణాలు తీసుకొని వెళ్లారు.ఈ సంఘటనపై మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు పై ఎల్ఎండి పోలీసులు కేసు నమోదు చేయగా అప్పటి సీఐ శశిధర్ దర్యాప్తు జరిపి కోర్టులో ఛార్జి షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను సిడివో పీసీ శ్రీనివాస్ కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి శరత్ వారిని విచారించి వాదించారు. సాక్షా ధారాలు పరిశీలించిన జడ్జి నిందితులు శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ లకు జీవిత ఖైదు తో పాటు రూ.3 వేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

మత్తు పదార్థాలు లేని బడులే మన లక్ష్యం

చురకలు విలేఖరి,వీణవంక నవంబర్ 19 : ప్రతి పాఠశాలను మత్తు పదార్థ రహిత బడిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వీణవంక జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం. వల్లంపట్ల చంద్రమౌళి అన్నారు.



ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాద్ ఎస్సీఈఆర్టీలో జరిగిన 'ప్రహరి యువ సురక్ష' రాష్ట్ర స్థాయి శిక్షణలో పాఠశాల స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ జారీ చేసిన అభినందన పత్రాన్ని గురువారం హెచ్ఎం ఆయనకు అందజేశారు. జిల్లాలోని బడుల్లో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తానని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్, రాజయ్య, లింగయ్య, రాజశేఖర్, రాజు, శ్రీనివాస్, స్వర్ణలత,సరోజన, సాబీర్ ఖాన్, కిరణ్ కుమార్, వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి తెచ్చిన కరువుతోనే

రాష్ట్రంలో తాగునీటి కష్టాలు

మొదటి పేజీ తరువాయి....

ప్రజల్లో తెలంగాణ ఆవశ్యకతను వివరించి ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారన్నారు. తెలంగాణ తెచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో నినాదంతో ఉద్యమించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతో, సకల జనులు ఉద్యమించడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందన్నారు. కేసీఆర్ సంక్షేమ పథకాలతో తెలంగాణకు ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి గురుకులాలు, వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి వైద్య సదుపాయం అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. బీడీ కార్మికులకు కూడా పెన్షన్ అందించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి, ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నింపేందుకు రివర్స్ పంపింగ్ చేశారన్నారు. మూడేళ్ల నుంచి రద్దయిన పెన్షన్లు 4,70,000 ఉంటే 4,50,000 మాత్రమే ఇస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ ప్రకటించిన ఉద్యోగాలలో మూడేళ్లు గడుస్తున్నా పది శాతం ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమ నాయకుడు హరీష్ రావుతో పోలిక ఏమిటని నిలదీశారు. రైతులను ఆదుకోవాలని కేసీఆర్ రైతు బీమా అందించారన్నారు. భూములు ఎంతమంది పేరు మీద ఉంటే అంతమందికి బీమా వర్తింపజేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ బీమా కింద కేవలం కుటుంబానికి ఒక్కరికే ఇస్తామంటోందని, భూమి ఉన్న అందరికీ బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డికి ప్రతిరోజూ కేసీఆర్, కేటీఆర్ ను తిట్టందే నిద్ర పట్టడం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక బీఆర్ఎస్ నాయకులను తిట్టడం కోసమే బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు వెళ్తున్న కారును అరెస్ట్ చేసిన అలుగునూరులో దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణ రాష్ట్ర ప్రకటన వచ్చిందని, తెలంగాణ ఉద్యమ చరిత్రలో దీక్షా దివస్ ఒక చారిత్రక ఘట్టమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు పెన్షన్ 2000లకు పెంచి, నీటి వనరులు, చెరువులు పునరుద్ధరించి ప్రజల జీవన ప్రమాణ స్థాయి పెంచారన్నారు. నేటి యువతకు బీఆర్ఎస్ నాటి పోరాటం, త్యాగాలు తెలిసే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే అభివృద్ధి పేరిట పార్టీ మారి, కాంట్రాక్టుల కోసం, బిల్లుల కోసం పనులు చేసుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, జగిత్యాలలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచులు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండగట్టు చందనోత్సవాలకు పటిష్ట బందోబస్తు

మొదటి పేజీ తరవాయి....

ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భక్తులు తమ విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. భక్తుల వాహనాల రాకపోకల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారులు, ఆలయానికి వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని తెలిపారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, మల్యాల సీఐ రాజ్ కుమార్, ఎస్ఐలు సందీప్, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్ట మధు వ్యాఖ్యలను ఖండించిన

కాంగ్రెస్ నాయకులు



చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 19: మంథని నియోజకవర్గంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి సతీష్ విమర్శించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు కూచిరాజ్‌పల్లిలో ప్రాథమిక పాఠశాల సమీపంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూచిరాజ్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి విద్యార్థులకు ప్రమాదకరంగా మారిందని, ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికుల అభిప్రాయాల మేరకు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో పాత భవనాన్ని తొలగించి, రూ.40 లక్షల వ్యయంతో నూతన పాఠశాల భవనం నిర్మించేందుకు మంత్రి ప్రొసీడింగ్స్ ఇప్పించారని పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ విషయాలపై అవగాహన లేకుండా పుట్ట మధు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించకుండా విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజా సమస్యలపై అవగాహనతో మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాదేశి పద్మ, నాగేల్లి జానీ, కామిని రమేష్, గడ్డం శంకర్, గంట బాలయ్య, నాగేల్లి మహేష్, పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు కాంగ్రెస్

హయాంలో సముచిత స్థానం



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 19 : మహిళా సంఘాల నమ్మకాలకు నూతన వీవో భవనాలు ఎంతో ఉపయోగపడతాయని హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. గురువారం ఇల్లందకుంట మండల పరిధిలోని గడ్డివా నిపల్లి, భోగంపాడు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన వీవో భవనాలను స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో కలిసి ప్రణవ్ ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘాల నాయకురాళ్లతో ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు గ్రామీణ అభివృద్ధికి కూడా ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్గటూర్‌లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 19 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టి. శైలందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతికార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అంబేద్కర్ కూడలి వద్ద దివంగత నేత భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలువేసి ఘననివాళులు అర్పించారు.భారత దేశానికి ప్రధానమంత్రిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల, గ్రామీణ నాయకులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత



చురకలు విలేకరి,బీర్‌పూర్,నవంబర్ 19 : బీర్ పూర్ మండల కేంద్రానికి చెందిన బింగి లలితకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్ఓసీ మంజూరు చేయించి గురువారం క్యాంపు కార్యాలయంలో లలిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, సర్పంచ్ హరీష్, నాయకులు శ్రీనివాసరావు, డిల్లీ రామారావు, నలువాల సురేష్, సర్పంచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ సమస్యను వెంటనే పరిష్కరించాలి



చురకలు విలేకరి, జగిత్యాల,నవంబర్ 19 : జగిత్యాల పట్టణంలోని 2వ వార్డులో చెత్త సేకరణ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.గత కొంతకాలంగా వార్డులో చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా రాకపోవడంతో వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోందన్నారు.దోమలు,ఈగలు పెరిగి చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు.ప్రతిరోజూ చెత్త సేకరణ వాహనాలు వచ్చేలా చర్యలు తీసుకుని, పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, బూత్ అధ్యక్షులు నారాయణ, పవన్ సింగ్, 2వ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



చురకలు విలేకరి, రాయికల్, నవంబర్ 19 : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.గురువారం రాయికల్ పట్టణంలో గుడి కోట కమ్యూనిటీ హాల్లో పట్టణానికి చెందిన 166 మంది లబ్ధిదారులకు మంజూరు చేసిన చేయూత పెన్షన్ల ఉత్తర్వు పత్రాలను, రెండో విడత ఇందిరమ్మ ఇండ్లలో మంజూరైన 36 మందికి మంజూరు పత్రాలు అందించారు. అనంతరం మాజీ ప్రధాని ఇంద్ర గాంధీ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేస్తున్నారని పేద ప్రజల పక్షాన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు.గతంలో భూమి ఉన్నవారికి, గల్ఫ్ కార్మికులు మరణిస్తే 5 లక్షల పరిహారం ఇస్తే నేడు ప్రతి కుటుంబానికి కుటుంబ పెద్ద మరణిస్తే 5 లక్షలను ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తుందన్నారు.రాయికల్ పట్టణానికి మొదటి విడత 280 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగా 219 నిర్మాణ దశలో ఉన్నాయని 71 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ఒంటరి మహిళలు,బీడీ కార్మికులు,గీతా,నేత కార్మికులు పెన్షన్లలో కేంద్రం వాటా సున్నా అని అన్నారు. రాయికల్ పెద్ద చెరువు అభివృద్ధికి మూడు కోట్ల వరకు నిధులు మంజూరు చేయగా అందులో 67శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందని కేంద్ర ప్రభుత్వాన్ని 33 శాతం కాగా 18శాతం జిఎస్టి రూపంలో తిరిగి వసూలు చేస్తున్నారని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లలో 3 లక్షల 78 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వాటా కాగా కేంద్ర ప్రభుత్వం ఆట 72000 మాత్రమేనని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగం కావాలని ఇక్కడి ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని అన్నారు.పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు అందేలా చూస్తానని హామీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య,మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ తురగ సౌజన్య,ఆత్మ చైర్మన్ కాటిపేల్లి గంగారెడ్డి,ఏఎంసీ చైర్మన్ రవీందర్ రావు,పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,కమిషనర్ మనోహర్ గౌడ్, ఎమ్మెల్యో నాగార్జున,ఎంపిడిఓ చిరంజీవి,కౌన్సిలర్లు పల్లికొండ గంగాధర్,బత్తిని మహేశ్వర,ధర్మపురి, శ్రీధర్,మౌనిక,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు వాసం రాజేందర్,నాయకులు కోల శ్రీనివాస్,మున్ను,సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 19 : మాజీ ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, అభివృద్ధి కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.ఆమె హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు,కెనాల్ వ్యవస్థలతో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిందన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటైన అనేక ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఆమె హయాంలోనే ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేయడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజన కరమన్నారు.జగిత్యాల పట్టణంలో సుమారు 31 వేల కుటుంబాలకు ఈ పథకం కింద రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. పేద,మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం పథకాన్ని అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీశ్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, ఆడువాల జ్యోతి లక్ష్మణ్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొలిశెట్టి గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, నవంబర్ (19) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో గురువారం తరలివెళ్లాయి. వెల్మ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ప్రత్యేక వాహనాల్లో సిద్ధిపేటకు ప్రత్యేక వాహనాలలో బయలుదేరారు.నర్సింగరావు నాయకత్వంలో పార్టీ శ్రేణులు పర్యటనలో పాల్గొనేందుకు ఉత్సాహంగా తరలివెళ్లారు. మండలంలోని గ్రామస్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల్లో సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వాహనాల్లో బయలుదేరి సిద్ధిపేటకు చేరుకునేందుకు ప్రయాణం సాగించారు. ఈకార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో పెద్దమ్మ తల్లి బోనాలు



చురకలు విలేకరి, జగిత్యాల,నవంబర్ 19 : జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,జగిత్యాల జిల్లా,నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల ఉత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పడిగేల గంగారెడ్డి, ఎల్లా రాజన్న, కల్లూరి హరీష్, అరె ధర్మయ్య, వేణు, మునిందర్ రెడ్డి, రాజశేఖర్, ధర్మయ్య, సురేష్, రాజు, ముదిరాజ్ సంఘ నాయకులు నీలం పెద్దులు, సంఘ నాయకులు, మహిళలు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణకు వెల్లుల్ల విద్యార్థుల ప్రతిజ్ఞ

-నీటిని పాడుపు చేద్దాం.. భావితరాలకు జీవజలాన్ని అందిద్దాం



చురకలు విలేకరి, మెట్‌పల్లి,నవంబర్ 19 : ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, భూగర్భ జలమట్టం రోజురోజుకూ తగ్గిపోతున్న నేపథ్యంలో నీటి సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నీటిని వృథా చేయకుండా, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు ప్రార్థనా సమయంలో ఒక నిమిషం పాటు నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నీరు జీవనాధారమని,ప్రతి నీటి చుక్కను విలువైన వనరుగా భావించి సంరక్షించు కోవాలని సూచించారు.విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైతం నీటి పొదుపు ఆవశ్యకతను తెలియజేయాలని, తద్వారా భావితరాలకు నీటి కొరత లేని భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం పాఠశాలకు ఫ్రిజ్ విరాళం



చురకలు విలేకరి, గొల్లపల్లి, నవంబర్ 19 : గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన ఆడెపు మధు ఇటీవల అకాల మరణం చెందగా, ఆయన జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు మానవత్వం చాటుకున్నారు. చాణక్య స్కూల్ లో 2015-2016 సంవత్సరం ఎస్ఎస్సీ బ్యాచ్ స్నేహితులు కలిసి రాఘవపట్నం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థుల సౌకర్యం కోసం 80 లీటర్ల సామర్థ్యం గల ఫ్రిజ్ ను విరాళంగా గురువారం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్, మాజీ సర్పంచులు బి.తిరుపతి గౌడ్, కె.అరవింద్ గౌడ్,మాజీ ఎంపీటీసీ ఎస్. మధుకర్ రెడ్డి,మాజీ ఉపసర్పంచ్ వి. ఆంజనేయులు,గౌడ సంఘం అధ్యక్షుడు కె. ప్రవీణ్ గౌడ్, ఎస్. జేలంధర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు,నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్ఎస్సీ బ్యాచ్ స్నేహితులు,మధు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దేశ ఐక్యత కోసం ఆత్మబలిదానం చేసిన ఇందిరమ్మ

-ఇందిరాగాంధీ దేశం కోసం చేసిన సేవలు చిరస్మరణీయం
-జయంతి సభలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు : జువ్వాడి కృష్ణారావు



చురకలు ప్రతినిధి కోరుట్ల, నవంబర్ 19 : దేశ ఐక్యత, సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన గొప్ప నాయకురాలు, దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కొనియాడారు. ఇందిరాగాంధీ 109వ జయంతి సందర్భంగా గురువారం కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ దేశ ఐక్యతకు భంగం కలిగించే శక్తులను ధైర్యంగా ఎదుర్కొన్న నాయకురాలు ఇందిరాగాంధీ అని అన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించిన ఖలిస్థాన్ ఉగ్రవాదుల కుట్రలను అడ్డుకునేందుకు ఆమె కఠిన నిర్ణయాలు తీసుకున్నారని, దేశ సమగ్రత కోసం చివరకు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ పాలనలో బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు, 20 సూత్రాల కార్యక్రమం వంటి కీలక సంస్కరణలు అమలు చేశారని తెలిపారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు 1974లో తొలి అణు పరీక్ష నిర్వహించి భారతదేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, పుప్పాల ప్రభాకర్, ఎంబెరి సత్యనారాయణ,పెరుమాండ్ల సత్యనారాయణ, సంఘ లింగం, నజీర్, చిట్యాల లక్ష్మీనారాయణ, ఆర్. భూమయ్య, రిజ్వాన్,రియాజ్,ఎతిరాజ్యం నరసయ్య, మరిపెద్ది జనార్దన్, నయీమ్, తోట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నిధులు రాబందుల పాలు

-వెల్గటూర్ పిఎసిఎస్ నిధుల దుర్వినియోగం పై విచారణ జరపాలి
-జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గండ్ర శ్రీకాంత్ రావు



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 19 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గండ్ర శ్రీకాంత్ రావు ఆరోపిస్తున్నారు.సహకార సంఘం లావాదేవీలు, జమా ఖర్చులపై సమాచార హక్కు చట్టం కింద జిల్లా సహకార అధికారికి పిర్యాదు చేయగా, అసంపూర్తి సమాచారం ఇవ్వడమే కాక సహకార సంఘాలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రావని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు.ఇచ్చినఅసంపూర్తి సమాచారంలోనే సహకార సంఘ భవనం, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, సహకార సంఘం నిర్వహణ ఖర్చుల పేరుతో కోట్ల నిధుల ను దుర్వినియోగం చేసినట్లు తెలుస్తుందన్నారు నూతన సంఘ భవనం నిర్మాణానికి కోటి రూపాయలు ఖర్చు చేసి నట్లు రికార్డుల్లో నమోదు చేశారు.ఈ సంఘనిర్మాణానికి కొనుగోలు చేసిన ఇసుకను బయట మార్కెట్లో అక్రమంగా విక్రయించిన వారు ఎవరో తెలపాలన్నారు.సంఘ భవన నిర్మాణంకు కోటి రూపాయల ఖర్చు చూపించారని వాస్తవం గా భవనం నిర్మాణానికి అంత ఖర్చు కాదని తప్పుడు ఎస్టిమే షన్ తో ఎంబీరికార్డ్ చేసి నిధు లు స్వాహా చేశారని ఆరోపణ చేశారు. అలాగే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కు గత ఐదేళ్ల కాలంలో ఖరీఫ్, రబీ సీజన్లో కలిపి 16 నుంచి 18 లక్షలవరకు సంచుల్లా నికి ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. ఇలా ఇదేళ్ల కాలంలో సుమారు 85 లక్షల ఖర్చులు చూపించారని, తప్పుడు లెక్కలతో లక్షల రూపాయల నిధులు స్వాహా చేసినట్లు తెలిపారు. గన్నీ సంచుల వ్యవహారంలోనూ తేడాలు ఉన్నట్లు, గన్నీ సంచుల తరుగు కింద వేల రూపాయలు సంఘానికి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. బాధ్యత రాహిత్యంతో గన్నీ సంచుల తరుగు కింద వచ్చిన నష్టానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. నిర్వహణ ఖర్చు ల్లోను భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు.ఇంతపెద్ద మొత్తంలో అక్రమాలు జరుగు తున్నా ప్రతి సంవత్సరం ఆడిట్ నిర్వహిస్తున్నా.ఈ అక్రమాలను అధికారులు ఎక్కడ బహిర్గతం చేయడం లేదు. సమాచార హక్కుచట్టం కింద సహకార సంఘాలు రావనే సాకుతో లక్షలనిధులు స్వాహా చేసినా ఎవరూ పట్టించుకోరనే ధైర్యంతో అక్రమాలకు పాల్పాడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏన్నో పథకాలు పెట్టి రైతులను ఆదుకోవాలని చూస్తుంటే రైతుల సహకారంతో నడిచే సహకార సంఘాల్లో అమాయ క రైతుల సొమ్ము రాబందుల్లా దోచుకుంటున్నట్లు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత అధి కారులు స్పందించి వెల్గటూర్ పీఏసీఎస్ పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని, రైతుల సొమ్ము కాపాడి సంఘ అభివృద్ధికి పాటుపడాలని శ్రీకాంత్ రావు డిమాండ్ చేశారు.

ఇందిరా గాంధీ జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకం

-ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి

చురకలు విలేకరి, ధర్మపురి, నవంబర్ 19 : భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకమని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. ఇందిరా గాంధీ జయంతి వేడుకలు గురువారం ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరా గాంధీ భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ధైర్యం, ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పంతో దేశానికి నాయకత్వం వహించిన గొప్ప నాయకురాలని కొనియాడారు. దేశ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం,మహిళా సాధికారత కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.ఆమె జీవితం నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్



చీపిరిశెట్టి రాజేష్,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసారపు బాలగౌడ్,కౌన్సిలర్లు ఓజ్జల లక్ష్మణ్,సంగి ఆనంద్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్,మాజీ ఆలయచైర్మన్ జక్కు రవీందర్,సిపతి సత్యనారాయణ, సాగర్ ,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు , అధికారులు,పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కుటుంబలో ప్రతి సభ్యునికి ఇందిరమ్మ బీమా పథకం

-రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేటలో ప్రారంభించబోతున్నారు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 18 : ప్రతి కుటుంబలో ప్రతి సభ్యునికి ఇందిరమ్మ బీమాను వర్తింప చేయడానికి బృహత్తరమైన పథకాన్ని రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేటలో గురువారం ప్రారంభించ బోతున్నారని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి,స్టేట్ కోపరేట్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడుది రాజేందర్లతో పాల్గొని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు ఈ సభ ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గూర్చి వివరించడంతోపాటు గత ప్రభుత్వ తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొని దాచుకున్న వారి బండారాన్ని బయటపెట్టే ఈ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. వారితో పాటు మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు సూడిది రాజేందర్, ముఖ్యమంత్రి సిద్దిపేట సభ ఎల్లారెడ్డిపేట ఇన్చార్జ్ రాష్ట్ర రోడ్డు ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, స్టేట్ కోపరేట్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి లు కూడా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య,సద్ది లక్ష్మారెడ్డి,బండారి బాల్ రెడ్డి,మర్రి శ్రీనివాస్ రెడ్డి,జజ్జరి దేవేందర్,గుండాడి రాంరెడ్డి,చిర్రం నాగరాజు యాదవ్,మాదాసు బాబు,చెన్నీ బాబు,ప్రజా ప్రతినిధులు,వివిధ హోదా ల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద వే ప్రాజెక్ట్ రహదారి

అలైన్‌మెంట్‌లో అక్రమ నాలా కన్వర్షన్లు

-ఆధారాలతో కలెక్టర్‌కు నాయిని సంతోష్ ఫిర్యాదు



చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 19 : పెద్దపల్లి జిల్లా మంథని పరిధిలోని శ్రీపాద వే ప్రాజెక్ట్ రహదారి అలైన్‌మెంట్ భూముల్లో అక్రమంగా నాలా కన్వర్షన్లు జరిగినట్లు ఆరోపిస్తూ మంథనికి చెందిన నాయిని సంతోష్ గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో కూడిన ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో పాటు సమర్పించిన అధికారిక జాబితా ప్రకారం 15 నమోదులకు సంబంధించి సుమారు 6 ఎకరాల 38 గుంటల భూముల నాలా కన్వర్షన్ వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. శ్రీపాద వే ప్రాజెక్ట్ రహదారి అలైన్‌మెంట్, భవిష్యత్తులో జరిగే భూసేకరణను దృష్టి లో పెట్టుకుని ముందస్తుగా ఉద్దేశ పూర్వకంగా నాలా కన్వర్షన్లు చేయించు కున్నారని సంతోష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకుండా, ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లకుండా అడ్డుకోవడమే తన ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కేవలం 15 నమోదులకే పరిమితం కాకుండా శ్రీపాద వే ప్రాజెక్ట్ పూర్తి అలైన్‌మెంట్ పరిధిలోని అన్ని గ్రామాలు, సర్వే నంబర్లలో జరిగిన నాలా కన్వర్షన్లపై సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా జరిగిన నాలా కన్వర్షన్లను వెంటనే రద్దు చేయాలని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆధారాలతో ఫిర్యాదు అందిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌పై ఉందని స్పష్టం చేశారు.స్పందన లేకపోతే ఉన్నతాధికారు లను ఆశ్రయించడంతో పాటు అవసర మైతే తెలంగాణ హైకోర్టును న్యాయ పరంగా ఆశ్రయిస్తానని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

స్పోర్ట్స్ డ్రెస్సులు, స్టీల్ గ్లాసుల పంపిణీ



ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 19 : హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 'జయన్న ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఉచిత స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ కార్యక్రమంగురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .జయన్న ఫౌండేషన్ నిర్వాహకులు సరిత జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ ఉచితంగా స్పోర్ట్స్ యూనిఫామ్‌లను అందజేశారు.పాఠశాల విద్యార్థుల కోరిక మేరకు, వారు ప్రతిరోజూ పాఠశాలలో రాగిజావ తాగేందుకు వీలుగా మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని తన వంతు సహాయంగా 180మంది విద్యార్థులకు ఉచితంగా స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు రాధిక, కౌన్సిలర్లు భారతి, రాజ్ కుమార్, మహమ్మద్ ఖలీద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రత్నం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల మరియు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

నేటి నుండి 'ఇందిరమ్మ కుటుంబ

జీవిత భీమా పథకం' ప్రారంభం



చురకలు ప్రతినిధి హుజూరాబాద్, నవంబర్ 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం' హుజూరాబాద్ పురపాలక సంఘం పరిధిలో శుక్రవారం ప్రారంభం కానుందని మునిసిపల్ కమిషనర్ బి కిషన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఆయా వార్డుల వారీగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి వార్డు కార్యాలయంలో 1, 13 వార్డులకు,మునిసిపాలిటీ కార్యాలయం లో 2, 15, 16, 17 వార్డులకు, పాత కూరగాయల మార్కెట్ వద్ద 3, 4, 18, 27 వార్డులకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది.సత్సంగం వద్ద 5,6,19,20వార్డులకు, వెంకటేశ్వర టాకీసు వద్ద 7,21,26,28 వార్డులకు, ఇప్పల్ నర్సింగాపూర్‌వార్డు కార్యాలయం లో 8,9,10,11వార్డులకుసంబంధించిన ప్రజలు హాజరుకావాలని సూచించారు. బోర్నపల్లి వార్డు కార్యాలయంలో 12, 14, 24 వార్డులకు, మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో 22, 23, 25, 29, 30 వార్డులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు తెలిపారు.ఆయా వార్డుల పరిధిలోని అర్హులైన పట్టణప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కోరారు.

వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కేకేకు ఆహ్వానం

-రథోత్సవానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేత



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 19 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు, రథోత్సవానికి హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కేకే మహేందర్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న స్వామివారి కల్యాణోత్సవం,రథోత్సవ కార్యక్రమాలకు హాజరై స్వామివారిఆశీస్సులు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంథని ఫోటోగ్రాఫర్‌కు అంతర్జాతీయ గుర్తింపు





చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 19 : మంథని పట్టణానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్, రవి వర్మ ఫోటో స్టూడియో యజమాని తూర్పాటి సత్యనారాయణకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది.ఫ్రాన్స్, ఇటలీ, మొనాకో దేశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక రామోగే ఫోటో కాంటెస్ట్ 2026 – ది మ్యాన్ అండ్ ది సీ పోటీలో ఆయన తీసిన బోండా మహిళ తాగుతోంది అనే ఫోటోకు ప్రత్యేక ప్రస్తావన లభించింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి వేలాది మంది ఫోటోగ్రాఫర్లు పంపిన ఫోటోలలో సత్యనారాయణ ఫోటో అంతర్జాతీయ జ్యూరీని ఆకట్టుకుంది. సముద్రంతో మనిషికి ఉన్న అనుబంధాన్ని, గిరిజన మహిళ జీవన విధానాన్ని ఆయన తన కెమెరాలో అద్భుతంగా బంధించారని నిర్వాహకులు ప్రశంసించారు. ఈ అవార్డు ప్రధానోత్సవం డిసెంబర్ 4, 2026న మొనాకోలోని ప్రపంచ ప్రసిద్ధ ఓషనోగ్రాఫిక్ మ్యూజియంలో జరగనుంది. ఈ వేదుకలో అంతర్జాతీయ జ్యూరీ సభ్యులు పాల్గొని విజేతలను సత్కరించనున్నారు. అనంతరం కాక్టెయిల్ పార్టీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తూర్పాటి సత్యనారాయణ మాట్లాడుతూ... మంథని లాంటి చిన్న పట్టణం నుంచి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది తెలంగాణ ఫోటోగ్రాఫర్లందరికీ గర్వకారణమని అన్నారు. మంథని పట్టణ ప్రజలు, ఫోటోగ్రాఫర్లు, జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు సత్యనారాయణకు అభినందనలు తెలియజేశారు.

దళితులకు అండగా మంత్రి శ్రీధర్ బాబు

-కొంకటి లింగమూర్తి ప్రశంస



చురకలు ప్రతినిధి మంథని,నవంబర్ 19 : పుట్టపాక సర్పంచ్ కన్నూరి రాజబాబు పై కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయడం అభినందనీయమని సామాజిక ఉద్యమకారుడు, కాంటెస్టెడ్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొంకటి లింగమూర్తి ఒక ప్రకటనలో అన్నారు. నిరంతరం పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మంథని అభివృద్ధి ప్రదాత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దళితుల పక్షాన నిలబడ్డారని ఆయన కొనియాడారు. దళితులకు అండగా నిలుస్తున్న మంత్రి శ్రీధర్ బాబుకు రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 18 : ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చేసిన సేవలను వారు కొని యాడారు ఈ కార్యక్రమంలో సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ట్రాన్స్కోర్ట్ కార్పొరేషన్ చైర్మన్ మాల్ రెడ్డి రామిరెడ్డి స్టేట్ కోపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి ఏఎంసి చైర్మన్ మేడిపల్లి దేవానందం సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు దొమ్మటి నరసయ్య మాజీ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, సర్పంచులు బాపిరెడ్డి సిర్రం నాగరాజు యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాడి రాంరెడ్డి మర్రి శ్రీనివాస్ రెడ్డి బండారి బాల్రెడ్డి,ఏంసి డైరెక్టర్లు వివిధ హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతి



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 19 : తొలి మహిళా ప్రధానమంత్రి, భారతరత్న దివంగత ఇందిరా గాంధీ జయంతి వేడుకలు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగాయి.హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, దేశానికి ఆమె చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ.. నాడు ఇందిరాగాంధీ ఏ దేశానికి తలవంచ లేదని గుర్తు చేశారు. భారతదేశ అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు.బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె కృషి చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 19 : భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరా గాంధీ 109వ జయంతి వేడుకలను గురువారం మండల పార్టీ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలు, దేశ సమగ్రతకు ఆమె చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

-బీఎస్పీ జిల్లా అధ్యక్షులు ఇరికిళ్ల రాజనర్సయ్య



చురకలు పెద్దపల్లిప్రతినిధి, కమాన్ పూర్ నవంబర్ 19 : పెద్దపల్లి జిల్లా లోని ప్రభుత్వ గురుకుల,ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులను చక్కదిద్ది,పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం,కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షు లు ఇరికిళ్ల రాజనర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హాస్టల్ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి,అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజనర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న వేలాది మంది బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాల్సి న బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.కానీ కొన్ని హాస్టళ్లలో పురుగుల అన్నం,కుళ్లిన కూరగాయ లు, కలుషిత తాగునీరు అందిస్తుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఏ ఒక్క హాస్టల్‌లోనూ నాణ్యత లేని ఆహారం వడ్డించకూడదని హెచ్చరించిన ఆయన, వంటగదులు,భోజనశాలలు,నిల్వ గదుల్లో పరిశుభ్రత పాటిస్తూ సురక్షిత తాగునీరు, నాణ్యమైన సరుకులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, నిర్లక్ష్యం వహించే వార్డెన్లు, కాంట్రాక్టర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రతి హాస్టల్‌లో విద్యార్థులతో కూడిన ఫుడ్ కమిటీ ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక తనిఖీ వ్యవస్థను తీసుకు రావాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు, విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్య చికిత్స అందించాలని,భద్రత దృష్ట్యా హాస్టల్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.విద్యార్థుల ఆరోగ్యం, ఆత్మగౌరవం,భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ బాధ్యత వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వరికిల్ల మల్లేశం,జింక ఉదయ్, జనగామ లింగయ్య,జనగామ రవి, బొంకూరి దుర్గయ్య, రంజిత్, పెగ నరేష్,రాఘవీర్, మాతంగి శంకర్, రామిల్ల శారద, జనగామ మల్లేష్, మధునయ్యతో పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో 'హితచింతక్' పూర్తి చేయాలి

-విహెచ్‌పి జాతీయ సంయుక్త సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం జీ

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 19 : ప్రతి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) చేపట్టిన 'హితచింతక్' కార్యక్రమాన్ని సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆ సంస్థ జాతీయ సంయుక్త సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం జీ కార్యకర్తలకు సూచించారు.ప్రఖండాల వారీగా చేపట్టిన పర్యటనలో భాగంగా గురువారం ఆయన హుజూరాబాద్ (ఎదులాపురం)ప్రఖండంలో పర్యటించారు.స్థానిక అయ్యప్ప దేవాలయ ఆవరణలో హిందూ బంధువులు,విహెచ్‌పి కార్యకర్తలు, గురుస్వాములతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సత్యం జీ మాట్లాడుతూ.. పట్టణంతో పాటు ప్రతి గ్రామంలో 'హితచింతక్'అభియాన్‌ను విజయవంతం చేయాలన్నారు. సంస్థాగత బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కొత్త కమిటీ ప్రకటన

హుజురాబాద్ పట్టణ నూతన కమిటీని సత్యంజి ప్రకటించారు. ప్రఖండ ధర్మాచార ప్రముఖ్‌గా కొమురవెల్లి రాజు,పట్టణ అధ్యక్షులుగా అక్కినపల్లి శ్రావణ్,పట్టణ కార్యదర్శిగా కనకం శ్రీనివాస్‌లను నియమించారు. అలాగే మండల ఉపాధ్యక్షులుగా కొండం రాజేందర్ రెడ్డి,గుడిశాల రమేష్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రాంత సేవా ప్రముఖ్ కోమల రాజేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఉప్పల శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం సుధాకర్ రావు,మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ఈదుల కంటకంటి రవీందర్ రెడ్డి, కందుల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు కంకణాల రమేష్ రెడ్డి, మండల కార్యదర్శి భాషాబోయిన చంద్రయ్య, గోరక్ష ప్రముఖ్ రావుల సురేష్, తూర్పాటి రాజు, పరిపాటి కొండల్ రెడ్డి, దామర అనురాగ్, బండారి లావణ్య, తదితర కార్యకర్తలు మరియు హిందూ బంధువులు పాల్గొన్నారు.



దేవాలయ ప్రతిష్ట కార్యక్రమంలో సత్యంజీ

బోర్నపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో సత్యం జీ పాల్గొన్నారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అంగీరక రాజేంద్రప్రసాద్ కమిటీ సభ్యులు సత్యంజీ ని ఘనంగా సన్మానించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన

-రెండో రోజు గణేష్ నామస్మరణతో మార్మోగిన బోర్నపల్లి

చురకలు ప్రతినిధి, హుజూరాబాద్, నవంబర్ 19 : హుజూరాబాద్ పట్టణ శివారులోని బోర్నపల్లి రోడ్డులో గల శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో విగ్రహ మరియు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య క్షేత్రం (శ్రీ జగద్గురు మధ్వాచార్య మూల మహాసంస్థానం) సుబ్రహ్మణ్య మఠాధిపతి శ్రీ డాక్టర్ విద్యాప్రసన్న తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండో రోజైనా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో మండప పూజలు,మహాగణపతి హోమం, విశ్వంభర పూజ,సూక్త హోమం, కుంకుమార్చన ప్రత్యేకవైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జలాధివాసం,హోమ కార్యక్రమాలు, ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిగాయి.స్వామీజీ ప్రత్యేకం గా విచ్చేసి భక్తులకు దర్శనమిచ్చి, తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ వేడుకలకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ బాబు – శమిత దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు మంగళ హారతులతో వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేశ నామస్మరణతో బోర్నపల్లి ప్రతిధ్వనించింది. వేద పండితులు బ్రహ్మశ్రీ పందిళ్ళ భాస్కర్ శర్మ, విజేందర్ శర్మ, కాట్రపల్లి విశ్వనాథ శర్మ పేద పఠనం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అంగరిక రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.



దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలి

-మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



చురకలు విలేఖరి చిగురు మామిడి

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక నిరాహార దీక్షకు గుర్తుగా ఈ నెల 29వతేదీన కరీంనగర్ జిల్లా అలుగునూరులో నిర్వహించనున్న దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల సతీష్ కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు .దీక్షా దివస్ సభ నిర్వహణ, విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ హాజరుకాగా,దీక్షా దివస్ సభ నిర్వహణ కోసం నియోజకవర్గ ఇంచార్జిగా విచ్చేసిన బీఆర్ఎస్ నాయకులు పుట్ట మధు పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయిందని,ఆ దీక్ష ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం మరింత ఉధృతమైందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయడమే దీక్షా దివస్ ముఖ్యఉద్దేశమని అన్నారు. ఈనెల 29న అలుగునూరులో నిర్వహించే దీక్షా దివస్ సభకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు,పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయి నుంచి సభకు జన సమీకరణ చేపట్టాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని నాయకులకు సూచించారు.తెలంగాణ సాధన కోసం సాగిన పోరాట స్ఫూర్తిని చాటుతూ,దీక్షాదివస్ సభను హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి భారీ జనసమీకరణతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వెన్ననొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు.. అది 'పాట్స్ స్పైన్' కావొచ్చు

-అరుదైన వెన్నెముక శస్త్రచికిత్సతో మళ్లీ నడిపించిన మలక్‌పేట్ యశోదా వైద్యులు శ్రీనివాస్ బొట్ల

-నడవలేని స్థితిలో ఉన్న వరంగల్ మహిళకు పునర్జన్మ



చురకలు ప్రతినిధి,హనుమకొండ నవంబర్ 19 : సాధారణ వెన్ననొప్పిగా భావించి నిర్లక్ష్యం చేస్తే,అది వెన్నెముకకు సోకే ప్రమాదకరమైన క్షయ వ్యాధి (పాట్స్ స్పైన్) కావొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.తీవ్రమైన వెన్ననొప్పితో నడవలేని స్థితికి చేరుకున్న వరంగల్‌కు చెందిన 50ఏళ్ల మహిళకు హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి మళ్లీ నడిపించారు. హనుమకొండ యశోద క్లినిక్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ బొట్ల మాట్లాడుతూ వరంగల్‌కు చెందిన సదరు మహిళ 15 రోజులుగా వెన్ననొప్పి,కాళ్లలో తిమ్మిర్లు, బలహీనతతో పాటు మలమూత్ర విసర్జనపై నియంత్రణ కోల్పోయి నడవలేని స్థితిలో మలక్‌పేట్ యశోదా ఆసుపత్రిలో చేరారు. వైద్య పరీక్షల్లో ఆమె వెన్నెముకలోని ణ6 నుంచి ణ9 వెన్నుపూసల మధ్య చీము చేరి, వెన్నుపామును తీవ్రంగా నొక్కుతున్నట్లు గుర్తించారు. బయాప్సీ, జీన్‌ఎక్స్‌పర్ట్ పరీక్షల ద్వారా ఇది వెన్నెముక క్షయగా నిర్ధారణైంది. ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలోని వైద్య బృందం ఆమెకు లామినెక్టమీ శస్త్రచికిత్స చేసి, చీమును తొలగించి వెన్నుపామును ఒత్తిడిని తగ్గించారు.అనంతరం బ్రైటానియం రాడ్లు, స్క్రూలతో వెన్నెముకను స్థిరీకరించి, క్షయ నివారణ చికిత్స (ఏటీటీ) అందించారు. చికిత్స, ఫిజియోథెరపీ అనంతరం ఆమె కోలుకుని సపోర్ట్‌తో నడవగలుగుతున్నారు. కాళ్లలోకి పాకే వెన్ననొప్పి, బలహీనత, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని డాక్టర్ శ్రీనివాస్ బొట్ల సూచించారు. క్లిష్టతరమైన ఈ శస్త్రచికిత్సను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని మలక్‌పేట్ యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర అభినందించారు.ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సిబ్బంది వాసు కిరణ్ రెడ్డి,గంగయ్య పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధిలో పరిశుభ్రతకే ప్రాధాన్యత

-రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు



చురకలు విలేకరి, మెట్‌పల్లి, నవంబర్ 19 : పట్టణ అభివృద్ధిలో పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం మున్సిపల్ పాలకవర్గం బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు అన్నారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ తెలంగాణ – స్వచ్ఛ మెట్‌పల్లి కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 నిధులతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ ను ఆయన గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పబ్లిక్ టాయిలెట్స్ పట్టణ ప్రజలకు, ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణాన్ని నిర్మించగలమన్నారు. మెట్‌పల్లిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు లేని బడులే మన లక్ష్యం



చురకలు విలేఖరి,వీణవంక నవంబర్ 19 : ప్రతి పాఠశాలను మత్తు పదార్థ రహిత బడిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వీణవంక జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం. వల్లంపట్ల చంద్రమౌళి అన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాద్ ఎస్సీఈఆర్టీలో జరిగిన 'ప్రహరి యువ సురక్ష' రాష్ట్ర స్థాయి శిక్షణలో పాఠశాల స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ జారీ చేసిన అభినందన పత్రాన్ని గురువారం హెచ్ఎం ఆయనకు అందజేశారు. జిల్లాలోని బడుల్లో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తానని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్, రాజయ్య, లింగయ్య, రాజశేఖర్, రాజు, శ్రీనివాస్, స్వర్ణలత, సరోజన, సాబీర్ ఖాన్, కిరణ్ కుమార్, వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మహమ్మారిని యువత తరిమేయాలి



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి)కమాన్‌పూర్ నవంబర్ 19 : గంజాయి మహమ్మారిని తరిమేసే బాధ్యత ప్రతి యువకుడిపై ఉందని కమాన్ పూర్ ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, గుండారం సర్పంచ్ జంగిలిపోచాలు అన్నారు. కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామంలో ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ పులిపాక దేవా దర్శకత్వంలో పోతుల మల్లయ్య దివ్య ఆశీస్సులతో...పోతుల సత్తెమ్మ సమర్పణలో కుమార్ నిర్మాతగా.. రూపొందుతున్న గంజాయి మహమ్మారిని తరిమేద్దాం అనే లఘు చిత్రాన్ని ప్రారంభించారు.అలాగే ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా రిటైర్డ్ ఏఎస్ఐ రవీందర్‌రావు, ప్రముఖ డైరెక్టర్ కుమార్ పటేల్, రేఖా రెడ్డి, మానస, స్వరూప, బేబీ సిరి, గుగులోతు తిరుపతి, మడిపోజు సతీష్, రజిత,చల్మల్ల శంకర్, అశ్వక్ ఖాన్, చంటి రమాకాంత్, కామెరా నరేష్,కాంపల్లి రాజేష్, కంక సునీల్, తదితరులు పాత్రలు వహిస్తున్నారు అలాగే వైద్య నరేష్ కెమెరామెన్ గా ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా వైనాల రాజు మాట్లాడుతూ. నేడు సమాజంలో గంజాయి మహమ్మారితో యువత చెడిపోతుందని గంజాయి మహమ్మారిని అందరూ కలిసి లేకుండా చేయాలని పేర్కొన్నారు. నేడు పోలీస్ సమాజం సైతం గంజాయి మహమ్మారిని తరిమేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంబిరి రాజేందర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్, వార్డు సభ్యులు దామెర దేవయ్య, బొడ్డు రవి, గాదెలత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో జల ప్రతిజ్ఞ

చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (19) : నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల్లో జల ప్రతిజ్ఞ కార్యక్రమం గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగిస్తామని, నీటి వనరులను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు కృషి చేస్తామని ప్రతినబూనారు. ప్రతి నీటి బొట్టును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

ఎమ్మెల్యే సంజయ్ బహిరంగ చర్చకు సిద్ధమా?

-గడిబురుజుల స్థలంపై అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా

-ఎమ్మెల్యేకు సవాల్ విసిరిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు : జువ్వాడి కృష్ణారావు



చురకలు ప్రతినిధి కోరుట్ల,

నవంబర్ 19 : కోరుట్ల పట్టణంలోని పురాతన గడిబురుజుల స్థల వివాదంపై ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు సవాల్ విసిరారు. గడిబురుజుల స్థలాన్ని వివాదాస్పదం చేస్తూ డబ్బులు దండుకోవడానికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. గురువారం కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కృష్ణారావు మాట్లాడుతూ పురాతన గడిబురుజుల ప్రాంతాన్ని కాపాడుతానంటూ ప్రకటనలు చేస్తూ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఒకరోజు 300 అడుగుల దూరంలో నిర్మాణాలు చేపట్టవచ్చని, మరోరోజు 15 అడుగుల దూరంలో నిర్మాణాలు చేయవచ్చని చెబుతూ రోజుకో ప్రకటనతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలో గతంలో కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ప్రస్తుతం ఎమ్మెల్యే సంజయ్ చేసిన అభివృద్ధి ఏమీలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో కొండ్రికర్ల వంతెన నిర్మిస్తానని బాండ్ పేపర్‌పై రాసిచ్చి హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, త్వరలోనే పూర్తవుతాయని పేర్కొన్నారు. గడిబురుజుల స్థలానికి సంబంధించిన ఆరోపణలు, వీఎల్‌టీ అంశంపై కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం మానుకుని బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే సంజయ్‌ను డిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణంలో ఎక్కడైనా, ఎప్పుడు చర్చకు సిద్ధమని, సమయం, తేదీని ఎమ్మెల్యేనే నిర్ణయించాలని కోరారు. పట్టణ ప్రజలు, అధికారుల సమక్షంలో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తమపై వచ్చిన అవినీతి ఆరోపణల్లో ఏ ఒక్కటైనా నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని జువ్వాడి కృష్ణారావు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, వైస్ చైర్మన్ పుప్పాల ప్రభాకర్, ఎంబెర్రీ సత్యనారాయణ, పెరుమాళ్ల సత్యనారాయణ, సంఘ లింగం, నజీర్, చిట్యాల లక్ష్మీనారాయణ, ఆర్. భూమయ్య, రిజ్వాన్, రియాజ్, ఎతిరాజ్యం నరసయ్య, మరిపెద్ది జనార్దన్, నయీమ్, తోట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పురుషుడు కుటుంబానికి మూల స్తంభం



-సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో పురుషుల దినోత్సవం

చురకలు విలేకరి, జగిత్యాల

నవంబర్ 19 : ప్రతి కుటుంబం వెనుక నిశ్శబ్దంగా నిలబడే మూల స్తంభం పురుషుడే నని తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా అసోసియేషన్ కార్యాలయం లో అంతర్జాతీయ పురుషుల దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 16 మంది సీనియర్ సిటిజెన్లను హరి అశోక్ కుమార్ అసోసియేషన్ మెమంటోలు అందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ సమాజంలో పురుషులు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలను ప్రస్థావిస్తూ మహిళల భద్రత కు ప్రత్యేక హెల్ప్ లైన్ ఉన్నట్లే పురుషుల భద్రతకు ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ను తమిళనాడు పురుషుల భద్రత సంఘాలు డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, మైనారిటీ నేత ఎం. డి. యాకూబ్, వివిధ సంఘాల ప్రతినిధులు వి. ప్రకాష్ రావు, బ్రహ్మయ్య,ఉమ్మడి జిల్లా యువజన జేఏ సీ అధ్యక్షులు ధోనూరి భూమాచారి తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కమిషనర్ గోపాల్‌కు భారీ సన్మానం

చురకలు విలేఖరి,కరీంనగర్,

నవంబర్, 19 : తెలంగాణ కమర్షియల్ యాక్సిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ జగన్మోహన్ రెడ్డి బిక్షపతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.కరీంనగర్ ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ గోపాల్ పుట్టినరోజు 58 సంవత్సరాల నుండి 59వ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ పెద్దపల్లి సిరిసిల్ల జగిత్యాల జిల్లాలకు చెందిన వాణిజ్య పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీమతి కవిత సత్యనారాయణ మూర్తి హరి చరణ్ డిసిటివోలు జగన్ మోహన్ రెడ్డి జి బిక్షపతి కొండారెడ్డి తిరుపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ కరీంనగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ గా పదవి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి గోపాల్ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రెవిన్యూ రావడానికి ఎంతో కృషి చేస్తున్నారు ఉద్యోగుల సమస్యలు కూడా ఆయన దృష్టికి వచ్చినచో ఆ సమస్యల పరిష్కారం కొరకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూ అందరి హృదయాలలో గుర్తింపు పొందిన అధికారి గోపాల్ గా పేరు వచ్చింది అలాంటి అధికారి గోపాల్ యొక్క పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఒక్క ఉద్యోగి శాలువాలతో సన్మానం చేస్తూ పూలదండలతో గజమాలతో అయినకు సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ గోపాల్ మాట్లాడుతూ కరీంనగర్లో పదవి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ఇప్పటివరకు అధికారులు ఉద్యోగులు ఉద్యోగ సంఘాలు ప్రతి ఒక్కరూ నాకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూ ప్రభుత్వ ఖజానాకు రెవిన్యూ తేవడానికి ప్రతి ఒక్క ఉద్యోగి ఎంతో కృషి చేస్తున్నారు అని అయినా అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ సలావుద్దీన్ విష్ణు అనిల్ రావు శంకర్ భారీ కృష్ణవేణి రాజేశ్వరరావు మహమ్మద్ అహ్మద్ రజిత మొహమ్మద్ ఇలియాస్ కౌసల్య ఈ సందర్భంగా భారీ ఎత్తున కేకులు పూల దండలు శాలువలతో భారీ ఎత్తున జాయింట్ కమిషనర్ గోపాల్ను అందరూ కలిసి సన్మానించినారు.



రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో

కోరుట్ల విద్యార్థినికి రజత పతకం

-అండర్-14 విభాగంలో : అయేషా మరియం ప్రతిభ

చురకలు ప్రతినిధి కోరుట్ల,

నవంబర్ 19 : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థిని అయేషా మరియం రజత పతకం సాధించింది. అండర్ - 14 బాలికల విభాగంలో 26 కిలోల లోపు వెయిట్ కేటగిరీలో పోటీపడిన అయేషా మరియం ఫైనల్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల కరస్పాండెంట్ గుజ్జెటి వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థిని రాష్ట్రస్థాయిలో రజత పతకం సాధించడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం సంతోషంగా ఉందని తెలిపారు.పతకం సాధించిన అయేషా మరియంను, ఆమె తండ్రి అతీక్‌ను పాఠశాల ప్రిన్సిపాల్, తైక్వాండో కోచ్ నవనంది రమేష్, అధ్యాపక బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



కోనాపూర్ సబ్ స్టేషన్‌తో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం



టీజీఎన్పీడిసిఎల్ ఎస్ఈ సుదర్శనం

చురకలు విలేకరి, కొడిమ్యాల,

నవంబర్ 19 : నూతన కోనాపూర్ సబ్ స్టేషన్ అందుబాటులోకి రావడంతో కోడిమ్యాల సెక్షన్ పరిధిలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం కానుందని జగిత్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం అన్నారు.జగిత్యాల సర్కిల్ పరిధిలోని కోడిమ్యాల సెక్షన్ లో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ కోనాపూర్ సబ్ స్టేషన్ ను గురువారం ఆయన టెక్నికల్ గా ఛార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ స్థానికంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా లోడ్ ను సమర్థవంతంగా నిర్వహించేందుకు, విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను తగ్గించేందుకు ఈసబ్ స్టేషన్ దోహదపడుతుందన్నారు. ముఖ్యంగా గృహ, వ్యవసాయ, వాణిజ్య రంగాల విద్యుత్ అవసరాలను మెరుగ్గా తీర్చేందుకు వీలవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల సర్కిల్ డీఈ ఆపరేషన్స్ గంగారాం, డీఈ ఎంఆర్టీ అండ్ కన్స్ట్రక్షన్, ఏడీఈలు, ఏఈలు, కన్స్ట్రక్షన్, సివిల్, ఎంఆర్టీ, టీఆర్ఈ విభాగాల అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.